క్లుప్తంగా

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్ భావన



కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యనూ సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ కమిషనర్, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి పలువురు ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ భావన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు 11 వినతులు అందాయి. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. పరిష్కారమైన సమస్యలకు సంబంధించి సంబంధిత దరఖాస్తుదారునికి సమాచారం కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, పలువురు డీఈలు, ఏఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కాకినాడ సిటీ: స్థానిక కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం వద్ద గురువారం ట్రస్ట్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి తెలిపారు. జనరల్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఆప్తమాలజీ విభాగాల్లో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సహాయ కార్మికశాఖ కమిషనర్ కేశవరావు

బోట్‌క్లబ్: భవన నిర్మాణ రంగంలో పనిచేసే ప్రతి కార్మికుడు భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేయించుకోవాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ జి.కేశవరావు అన్నారు. కాకినాడ ఉప కార్మికశాఖ కార్యాలయంలో మంగళవారం బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్స్ యూనియన్ కార్మిక నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో కార్మికులుగా నమోదు చేయించుకున్న వారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఎస్.బుల్లిరాణి, కార్మిక శాఖ అధికారులు రవిశేఖర్, లక్ష్మీ స్నేహ, పద్మావతి పాల్గొన్నారు.

సాధారణ కుర్చీల్లో సబ్ రిజిస్ట్రార్ల విధి నిర్వహణ



సాధారణ కుర్చీలో విధులు నిర్వహిస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 ప్రసాదరెడ్డి

కాకినాడ లీగల్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం నుంచి సబ్‌రిజిస్ట్రార్లు సాధారణ ఫ్లోరింగ్‌పై కుర్చీ వేసుకుని విధులు నిర్వహించారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్‌కి వచ్చే క్రయ విక్రయదారులుతో స్నేహపూర్వకంగా ఉండాలని క్రయ విక్రయదారులకు కూడా కుర్చీ వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న పోడియంలు, సింహాసనం లాంటి కుర్చీలు, ఎరుపు రంగు వస్త్రాన్ని తొలగించాశారు. ఈ మేరకు కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు -1 టి.ప్రసాదరెడ్డి సాధారణ ఫ్లోరింగ్‌పై వేసిన కుర్చీలో ఆసీనులై విధులు నిర్వహిస్తున్నారు.

మత్స్యకార గ్రామాల్లో డీఎస్పీ పర్యటన

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో మంగళవారం రాత్రి కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యటించారు. చినబొడ్డు వెంకటాయపాలెం, పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించే అమ్మవార్ల జాతరలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకుగాను కోరంగి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణతో కలిసి డీఎస్పీ ఆయా గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. మహాలక్ష్మి అమ్మవార్ల జాతర్లలో ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామపెద్దలు బాధ్యత తీసుకోవాలన్నారు.

ఉత్తీర్ణులూ.. ఇదిగో ఉపాధి..

- జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాలు
- ప్రతి నెలా 2 నుంచి 3 మేళాల నిర్వహణ
- ఉపాధి కార్యాలయానికి వెళ్లకుండా రిజిస్ట్రేషన్
- 2023-24 ఉత్తీర్ణులకు ఆహ్వానం



జిల్లా ఉపాధి కార్యాలయం

బాలాజీచెరువు: పదో తరగతి, ఆపై ఇంటర్‌మీడియెట్, డిప్లమో, ఐటీఐ, ఇంజినీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించారా.. అయితే జిల్లా ఉపాధి కార్యాలయం మీకు ఉపాధి కల్పిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ శాఖలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్ సత్ఫలితాలు ఇస్తోంది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మరింత చేరువ చేయడానికి కార్యాలయం శిక్షణ శాఖ ఆధ్వర్యంలో గత ఏడాది ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగ వివరాలు, ప్రభుత్వ శాఖల్లో జారీచేసిన నోటిఫికేషన్ల వివరాలు పొందుపరిచారు. నిరుద్యోగ యువత వారి విద్యార్హతలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారి విద్యార్హత వివరాల మేరకు అర్హులకు వారి మొబైల్ నెంబర్‌తో పాటు రిజిస్టర్ ఈ-మెయిల్ ఐడీకి సమాచారం అందుతుంది. ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీలు భర్తీ చేయడానికి ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాల సమాచారం, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీల భర్తీకు జారీ చేసే నోటిఫికేషన్ల సమాచారం ఈ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నవీకరిస్తున్నారు.

ఆధార్, ఫోన్ నెంబరుతో వెబ్‌పోర్టల్ లాగిన్..

- ఇంటర్‌నెట్‌లో ఎంప్లాయిమెంట్ ఏపీ.జీవోవీ.ఇన్‌లో జాబ్‌సీకర్‌లో వారి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వాలి.
- వారి విద్యార్హతలు, వివరాలు నమోదు చేసిన వెంటనే వారి మొబైల్‌కు సమాచారం వస్తుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే సంబంధిత జిల్లా ఉపాధి కార్యాలయానికి ఆ వివరాలు చేరతాయి.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ నంబరుకు అభ్యర్థిని పంపుతారు.

ఉపాధి కార్యాలయంలో విద్యార్హతల వారీగా నమోదు వివరాలు..

పదో తరగతిలోపు	490
పదవ తరగతి	6420
ఇంటర్‌మీడియట్	7340
డిగ్రీ	6890
డిప్లమో	3519
ఇతర విద్యార్హతలు	17,560

- ఏమైనా వివరాలు తప్పుగా ఉంటే, ఇంకా సమాచారం కావాలన్న ఉపాధి కార్యాలయ సిబ్బంది ఫోన్ ద్వారా వివరాలు తెలియజేస్తారు.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో నిర్వహించే విద్యార్హత పత్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు ఈ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చాయి.
- ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం రెండు రోజుల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు అందుతుంది.
- ఏ విద్యార్హత లేనివారు వివరాలు నమోదు చేసుకోవచ్చు. వారి విద్యతో సంబంధం లేని ఉపాధి కల్పిస్తారు.
- ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు.. ఉపాధి కల్పనశాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధృవపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో ధృవపత్రాలు ఇవ్వకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ఈ వెబ్‌పోర్టల్ యువతకు ఎంతో ఉపయోగం. విద్యకు తగ్గ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నాము. అర్హత గల ప్రతి యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. జిల్లాలో అన్ని ప్రముఖ, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానమై ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాము.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

వరద బాధితులకు ఎస్ఆర్ఎంటీ రూ.25 లక్షల విరాళం



కలెక్టర్ షణ్మోహన్‌కు రూ.25 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్ఆర్ఎంటీ జేఎండీ కంటిపూడి జయ

కాకినాడ సిటీ: భారీ వర్షాలు, వరదల వల్ల నిరాశ్రయులైన బాధితుల సహాయార్థం కాకినాడ శ్రీరామదాసు మోటార్ ట్రాన్స్ పోర్టు లిమిటెడ్ జేఎండీ కంటిపూడి జయ మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు రూ.25 లక్షల చెక్కును అందజేశారు. శ్రీరామదాసు మోటార్ ట్రాన్స్ పోర్టు లిమిటెడ్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

విశ్రాంత సైనికోద్యోగుల విరాళం రూ.42 లక్షలు

మన రాష్ట్రంలో వచ్చిన భారీ వర్షాలు, వరదలకు నష్టం కలిగిన కారణంగా విశ్రాంత సైనిక ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్‌లో సీఎం సహాయ నిధికి రూ.42 వేలు చెక్కును జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కి అందజేశారు. కలెక్టర్ షణ్మోహన్ రిటైర్డ్ సైనిక ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

కాకినాడలో స్వచ్ఛత హి సేవ



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వనమాడి, కమిషనర్ భావన తదితరులు



సొమ్మసిల్లి పడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

- మానవహారం-అవగాహన సభ
- ప్రజలు చైతన్యవంతులు కావాలని ఎమ్మెల్యే వనమాడి, కమిషనర్ భావన పిలుపు

కాకినాడ: పరిసరాల పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కమిషనర్ భావన పిలుపునిచ్చారు. స్థానిక కొండయ్యపాలెం వద్ద జరిగిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ 15 రోజుల పాటు పరిశుభ్రతతో పాటు దోమల నివారణ, ఇతర కార్యక్రమాల కోసం ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. కాకినాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సుధాకర్, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపంతో స్పృహ తప్పిన మహిళ

పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ నిర్వహణలో తప్పిదం చోటుచేసుకోవడంతో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయారు. 15 రోజుల పాటు తలపెట్టిన స్వచ్ఛత హీ కార్యక్రమాన్ని స్థానిక కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ వద్ద నిర్వహించేందుకు ప్రతిపాదించారు. కమిషనర్ భావన, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కాకినాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఉదయాన్నే ఈ కార్యక్రమం తలపెట్టి డ్వాక్రా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులను ఇందులో భాగస్వామ్యులను చేశారు. ఎమ్మెల్యే హాజరయ్యే ఈ కార్యక్రమానికి ఉదయం 7 గంటల నుంచే ఆయా వర్గాల మహిళలు, విద్యార్థులను పిలిపించారు. ఎమ్మెల్యే, కమిషనర్ సకాలంలో హాజరు కాకపోవడం, విపరీతమైన జాప్యం జరగడంతో ఎండ వేడిమితో డీ హైడ్రేషన్‌కు గురైన 13వ డివిజన్‌కు చెందిన లీల అనే మహిళ ఒక్కసారిగా స్పృహతప్పి కిందపడిపోయింది. దీంతో ఆగమేఘాలపై ఆమెను ఆస్పత్రికి తరలించారు. మరో వైపు సభా వేదిక వద్ద సరైన ప్రొటోకాల్ పాటించలేదంటూ టీడీపీకి చెందిన పలువురు నాయకులు అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కూర్చునేందుకు వీలుగా కుర్చీ వేయలేదంటూ టీడీపీ నేతలు అధికారులపై అసహనం వ్యక్తం చేయగా అధికారులు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



కాకినాడ బస్టాండ్‌లో పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

స్వచ్ఛ సేవా పక్షోత్సవాలు

కాకినాడ సిటీ: దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛ సేవా పక్షోత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యం మొదటి రోజు కాకినాడ బస్టాండ్‌లో పరిశుభ్రతపై సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ, స్వచ్ఛ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంఈ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకర్‌రావు పాల్గొని బస్టాండ్, గ్యారేజ్ పరిసరాలను శుభ్రపరిచారు.

దేశం గర్వించదగ్గ ప్రధాని మోదీ

బోట్‌క్లబ్: దేశం గర్వించదగిన ప్రధాన మంత్రుల్లో నరేంద్రమోదీ ప్రథమ వరుసలో ఉంటారని, విదేశాంగ విధానం నుంచి ఆర్థిక విధానం వరకూ ఆయన ముద్ర ఉందని బీజేపీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్ అన్నారు. స్థానిక గాంధీ నగర్‌లోని ప్రభుత్వ వసతి గృహంలో మాజీ బీజేపీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో మోడీ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దువ్వూరి సుబ్రహ్మణ్యం, గోడి వెంకట్, అరిపిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికవర్‌లో రక్తదాన శిబిరం

కాకినాడ రూరల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌లో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. అంతే కాకుండా హాస్పిటల్స్ ఆవరణలో ఉన్న బ్లడ్ బ్యాంకును సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఆస్పత్రి ఆవరణలోనే బ్లడ్ బ్యాంకు ఉండటం వల్ల ఎంతో ఉపయోగకరమని చెప్పారు. రోగులకు ఇబ్బందులు లేకుండా రక్తం అతి తక్కువ సమయంలోనే వైద్య సాయం అందించవచ్చు అని సెంటర్ హెడ్ సుభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదాతలతో పాటు మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మెడికవర్‌లో రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చినరాజప్ప



కేక్ కట్‌చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు పైడా కృష్ణమోహన్

ఓజోన్‌తోనే మానవజాతికి జీవం



ఓజోన్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్: ఓజోన్ పొరతోనే మానవజాతి మనుగడ సాధ్యమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.గాయత్రి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఏపీఎస్పీ క్వార్టర్స్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్ కాస్ట్), పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.గాయత్రి మాట్లాడుతూ 1987లో ఓజోన్ పొరను క్షీణింపజేసే పదార్థాలపై మాంట్రియల్ ప్రోటోకాల్ సంతకం చేసిన తేదీని గుర్తుచేసుకుంటూ, ఓజోన్ పొర పరిరక్షణ కోసం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు, కళాశాల ఇన్‌చార్జి కందుకూరి పాల్ రాజు మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలన్నారు. క్లోరోఫ్లోరో కార్బన్ల వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంటల్లో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్షులు ఎస్.చలపతి, పాఠశాల ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాస్, పీవీఎస్ ప్రకాష్, బి.సూరిబాబు, జి. నాగేశ్వరరావు, పి.జగదీష్, ఎండీ బాషా, శ్రీను, విజయలక్ష్మి, పాఠశాల, ఇంటర్ మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణానికి సమ్మతి

సాక్షి ఇంపాక్ట్

- విజయవాడ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

కాకినాడ క్రైం: ఈ నెల 12వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఆకలి కాలం' కథనానికి స్పందన లభించింది. ఈ మేరకు స్పందించిన కస్టమ్స్ రాష్ట్ర కమిషనర్ సాధు నరసింహారెడ్డి తన బృందాన్ని కాకినాడ జీజీహెచ్‌కు పంపారు. మంగళవారం నలుగురు అధికారులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారితో సమావేశమయ్యారు. సుభోజనం ఆవరణలో అన్నార్తులకు నీడ కల్పించేందుకు షెడ్ నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే, అక్కడున్న వేచి ఉండే ప్రదేశంలో బాత్రూంను పార్టిషన్లతో వేరు చేస్తామన్నారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేసిన సూపరింటెండెంట్ సంబంధిత గుమస్తాను పిలిచి అందుకు తగ్గ పత్రాలను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో డాక్టర్ లావణ్యకుమారి గైనిక్ వార్డుల్లో మరుగుదొడ్లకు తలుపులు లేవని, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల వద్ద ప్రస్తావించగా వాటి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు, నెలాఖరు నాటికి అనుమతుల ప్రక్రియ పూర్తి కావాలని అధికారులు సూపరింటెండెంట్‌ను కోరారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీ ధర్, శ్రీనివాస్ చౌదరి ఉన్నారు. ఈ సమావేశంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత పాల్గొన్నారు.



జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో సమావేశమైన కస్టమ్స్ అధికారులు

ఆయిల్ దుకాణాలపై తొమ్మిది కేసులు నమోదు

రాజమహేంద్రవరం రూరల్: వంట నూనెల ధరలు, నిల్వలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో పలు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. జిల్లాలోని మూడు హోల్‌సేల్, రెండు రిటైల్ ఎడిబుల్ ఆయిల్ దుకాణాలను, కాకినాడ జిల్లాలోని రెండు హోల్‌సేల్, ఒక రిటైల్ ఎడిబుల్ ఆయిల్ దుకాణాన్ని తనిఖీ చేసి నిబంధనలు విరుద్ధంగా ఉన్న కారణంతో తొమ్మిది కేసులు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కెఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తున్న, కృత్రిమ కొరత సృష్టిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూనెల ధరల్లో, నిల్వల్లో అక్రమాలకు పాల్పడేవారిపై 8008203261కు ఫోన్‌చేసి తనకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెట్టు పడి కారు ధ్వంసం



కారుపై పడిన చెట్టును పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక 26వ వార్డు అంబటి ఆయిల్ వెనుక భాగంలో నివసిస్తున్న అత్తిలి సతీష్ కారుపై మంగళవారం రాత్రి చెట్టు పడి కారు పైభాగం నుజ్జు నుజ్జు అయింది. తన ఇంటి వద్ద కారు పార్క్ చేసిన సమయంలో ఎటువంటి గాలి లేని సమయంలో గానుగ చెట్టు పడిపోయిందని అతడు వాపోయాడు. సంఘటనా ప్రదేశానికి ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, మున్సిపల్ సిబ్బంది చేరుకున్నారు. మున్సిపల్ సిబ్బంది కారుపై పడిన చెట్టును తొలగించారు.

వీధిలైట్లు వెలిగించరూ

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదని, దాని వల్ల పట్టణంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయని జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. మూడో వార్డులో జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రాంతంలో గత మూడు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదన్నారు. గతంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కంప్యూటర్ చోరీకి గురైందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాంతంలో వీధిలైట్లు వెలిగేలా చూడాలన్నారు. అలాగే పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఆరోపించారు. దోమల మందు పిచికారీ చేయకపోవడం వల్ల దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రెహమాన్ పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపునకు రంగం సిద్ధం

- నవర కాంప్లెక్స్ మార్పుపై వివాదం
- ఎంఈఓను నిలదీసిన గ్రామస్తులు
- ఇది కేవలం ప్రతిపాదన మాత్రమే అని చెప్పడంతో శాంతించిన ప్రజలు



నవర హైస్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపుకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా మండల పరిధిలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లను కుదించడానికి ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభిప్రాయాలను తీసుకున్నారు. 20 వేల జనాభాకు ఒక స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వం నుంచి ఏడాదికి తప్పని సరిగా స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.కోటి నిధులు విడుదల అవుతాయి. ఈ మేరకు మండల పరిధిలోని నవర స్కూల్ కాంప్లెక్సును మార్చాలని నిర్ణయించడంతో ఆ స్కూల్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మండల పరిధిలో జి.మేడపాడు, వేట్లపాలెం, మాధవపట్నం, నవర స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. జి.మేడపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పీబీ దేవం, మేడపాడు, జి.కొత్తూరు గ్రామాల్లో ఉన్న స్కూళ్లు వస్తాయి. అలాగే వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్‌లో వేట్లపాలెం, హుస్సేన్ పురం గ్రామాలకు చెందిన పాఠశాలలు వస్తాయి. మాధవపట్నం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వీకే రాయపురం, మాధవపట్నం, ఉండూరు, కాపవరం గ్రామాలకు చెందిన స్కూల్స్ వస్తాయి. నవర కాంప్లెక్స్ పరిధిలో పనసపాడు, అచ్చంపేట, గొంచాల, నవర, పవర, చంద్రంపాలెం గ్రామాలలోని పాఠశాలలు ఉన్నాయి, అయితే జి. మేడపాడు స్కూల్ కాంప్లెక్స్‌ను వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్‌లో విలీనం చేశారు. నవర స్కూల్ కాంప్లెక్స్‌ను ఉండూరు హైస్కూల్‌లో ఏర్పాటు చేయడానికి హెచ్ఎం సంతకం చేయడంతో ఆ గ్రామ ప్రజలు హైస్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. దాంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్యను గ్రామస్తులు నిలదీశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌ను మార్చడం సరి కాదన్నారు. కాంప్లెక్స్ ఏర్పాటుకు పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని, ఈ మేరకు ఉండూరు హైస్కూల్‌లో అవన్నీ ఉండటంతో మార్చడానికి ప్రణాళిక తయారు చేసినట్టు ఎంఈఓ గ్రామస్తులకు వివరించారు. అయినప్పటికీ తాము అంగీకరించేది లేదని గ్రామస్తులు భీష్మించారు. దాంతో విషయాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావుకు ఎంఈఓ వివరించారు. ఇది కేవలం ప్రతిపాదన మాత్రమేనని, గ్రామస్తులకు అంగీకారం లేకపోతే మార్పు ఉండదని చెప్పాడంతో గ్రామస్తులు శాంతించారు. కాగ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు ఒకే స్కూల్ కాంప్లెక్స్ ఉండగా దానిని రెండు స్కూల్ కాంప్లెక్స్‌లకు పెంచారు. అయితే పట్టణంలో జనాభా 60 వేలు ఉండటంలో మూడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.